## దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్ రూరల్, జులై 7: మండలంలోని గిరిజన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024 విద్యా సంవత్సరానికి గానూ రెండో విడుత ప్రవేశానికి విద్యార్థులను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, పదో తరగతి పాసై, 14 సంవత్సరాలు నిండిన వారు వెబ్‌సైట్ https://iti.telangana.gov.in ద్వారా ఈ నెల 15లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 94902 02037లో సంప్రదించాలని కోరారు.

## నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా


మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు

భైంసా, జూలై 7: నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

## పోచమ్మకు వెండి వడ్డానం బహూకరణ


వడ్డానం బహూకరిస్తున్న కీర్తి-శ్రీనివాస్ కుటుంబసభ్యులు

ఖానాపూర్ టౌన్, జూలై 7: ఖానాపూర్ పట్టణంలోని శాంతి నగర్ కాలనీలో గల ముత్యాల పోచమ్మ అమ్మవారికి కాలనీకి చెందిన కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ గాండ్ల కీర్తి-శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అదివారం అరకిలో వెండి వడ్డానం బహూకరించారు. ఆలయ అర్చకుడు నిమ్మగడ్డ శరత్ చంద్ర పూజలు నిర్వహించి, అమ్మవారికి వడ్డానాన్ని అలంకరించారు.

## ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీ


ఎన్నికైన సంఘం మండల కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి, జూలై 7: మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లూరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా జాదవ్ విజయ్, ప్రధాన కార్యదర్శిగా సోయినందన్, సంయుక్త కార్యదర్శిగా ఎర్మ విద్యాసాగర్, కోశాధికారిగా దూట రాహుల్ ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దేవునిగూడెంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం


గొడిసెర్యాల గొండు గూడెం(జీ)లో..

# అసంపూర్తిగా గ్రామ పంచాయతీ భవనాలు

- నిధుల కొరతతో మధ్యలో నిలిచిన పనులు
- నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజల వేడుకోలు

దస్తురాబాద్, జూలై 7: మండలంలోని పలు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించడానికి, రికార్డులను భద్రపరుచడానికి ఇబ్బందులు పడుతున్నారు. 2019లో 500 జనాభా ఉన్న తండాలను, గ్రామాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా ప్రకటించింది. అలాగే, కొత్త గ్రామ పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మండలంలోని దేవునిగూడెం, ఆకొండపేట, మున్యాల తండా, ఎర్రగుంట, పెర్కపల్లె, గొడిసెర్యాల గొండు గూడెం(జీ) గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా, దేవునిగూడెంలో భవనం పూర్తి కాగా పెయింటింగ్, ఇతర పనులు మిగిలి ఉన్నాయి. ఆకొండపేటలో 60 శాతం పనులు పూర్తయ్యాయి. మున్యాలతండాలో భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి వదిలేశారు. పెర్కపల్లెలో పిల్లర్లు నిర్మించి పనులను నిలిపివేశారు. ఎర్రగుంట, గొడిసెర్యాల గొండు గూడెం(జీ) గ్రామ పంచాయతీల్లో 60 శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పనులు త్వరగా పూర్తి చేసి, భవనాలను అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈలు లవకుమార్, ప్రశాంత్‌ను వివరణ కోరగా నిధులు రాకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిపారు.


ఆకొండపేటలో..

## ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

నార్నూర్, జూలై 7: మాదిగ అమరుల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోరెల మహేందర్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరెల మహేందర్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా మాదిగలకు వర్గీకరణ ద్వారా దక్కాల్సిన న్యాయమైన హక్కుల కోసం చేసిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరుల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోడీ మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన నాయకులు జిల్లాపల్లి సుకుమార్, కాంబ్లేసాయి, జిల్లాపల్లి ప్రకాశ్, మోరె మహేందర్, తరుడే సీతారాం, పీటర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.


అమరుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోరెల మహేందర్


వాహనదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మొబిన్

## ట్రాఫిక్‌రూల్స్ పకడ్బందీగా అమలు చేస్తున్నం

ఎదులాపురం, జూలై 7: పట్టణంలో ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కలెక్టరేట్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. పాత చలాన్లు ఉంటే కట్టించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, వాహనం నంబర్ ప్లేట్ కనిపించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మొబిన్, కానిస్టేబుళ్లు లాల్‌షా, మంగల్‌సింగ్, రాజేశ్వర్, విజయ్‌సింగ్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## సల్లంగా సూడు పోచమ్మ తల్లీ

దస్తురాబాద్, జూలై 7: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్లతో బోనాలను నెత్తిన ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. బోనాల్లో తెచ్చిన నైవేద్యం అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తాతత్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, మండల ఆటో డ్రైవర్ల యూనియాన్ ఆధ్వర్యంలో డబల్ రాజ్ దేవుడికి, గండి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనే లక్ష్యం


గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

నార్నూర్, జూలై 7: గంజాయి నిర్మూలనే లక్ష్యమని గాదిగూడ ఎస్ఐ మహేశ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ, ఉట్నూర్ డీఎస్పీ, నార్నూర్ సీఐ పర్యవేక్షణలో సీసీఎస్ బృందం, పోలీసులు ఆదివారం గాదిగూడ మండలం కొత్తపల్లి(జీ), మేడిగూడ గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ముగ్గురి వద్ద రూ.3,30,000 విలువైన 13.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాదిగూడ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గంజాయి పండించినా, రవాణా చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## ప్రజల కోసం పని చేస్తా

- మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి


మాజీ జడ్పీటీసీ దంపతులను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ బోజారెడ్డి, నాయకులు, తదితరులు


తలమడుగు, జూలై 7: పదవుల కోసం కాదు, ప్రజల కోసం, మండలాభివృద్ధి కోసం పని చేస్తానని మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఆదివారం తాజా మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డితో పాటు ఎంపీపీ కల్యాణం లక్ష్మి, ఎంపీటీసీలకు గ్రామస్తులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా గోక గణేశ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సమస్యలుంటే తనను సంప్రదించాలని, పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

రెబ్బెన, జూలై 7: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# కారు కొంటారా?

**నేడు** కారు ప్రతి ఒక్కరికీ అవసరంగా మారుతున్నది. నిజంగా చెప్పాలంటే కారు కొనేందుకున్న అవకాశాలూ అందరికీ పెరిగిపోయాయిప్పుడు. చాలామంది ఆర్థిక స్థోమత బలపడటంతో కార్ల అమ్మకాలూ జోరుగా సాగుతున్నాయి. అయితే కారు అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సొంతింటి తర్వాత చాలా మంది కల కారు కొనుగోలేననడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కారు కొనుగోలులో తెలివిగా వ్యవహరించండి.





### ఇవి చేయండి

#### బడ్జెట్ వేసుకోవాలి

కారు కొనాలన్న ఆలోచన రాగానే ముందుగా బడ్జెట్ సెట్ చేసుకోండి. దీనివల్ల మీ కష్టార్జితం వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. స్థోమతకు మించిన ఖర్చులకెళ్లడం లేనిపోని కష్టాలనే తెచ్చిపెడుతుంది. ఇక కారుకు చెల్లించే అధిక ధర.. బీమా, చెల్లించే వడ్డీలను ప్రభావితం చేయగలదని మర్చిపోవద్దు.

#### ఫీచర్లు చూడాలి

ఒకప్పుడు కారు అంటే.. కేవలం ప్రయాణ సాధనమే. కానీ ఇప్పుడు అంతకు మించేనని చెప్పవచ్చు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు వస్తున్న కార్లలో ఎన్నో ఫీచర్లుంటున్నాయి. కాబట్టి రకరకాల కంపెనీలు తెస్తున్న కార్ల గురించి, వాటిలోని ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకొని మార్కెట్‌లోకి అడుగుపెట్టండి. ఇందుకోసం సంప్రదాయ, ఆన్‌లైన్ వేదికలను వాడుకోండి.

#### టెస్ట్ డ్రైవ్ చేయాలి

మీరు ఎంచుకున్న బడ్జెట్‌లో వస్తున్న ప్రతీ కారునూ టెస్ట్ డ్రైవ్ చేయండి. అప్పుడే మీకు సౌకర్యవంతమైన వాహనాన్ని సొంతం చేసుకోగలరు. అంతేగాక టెస్ట్ డ్రైవ్‌లో రకరకాల రోడ్లపై కారు ఎలా ప్రయాణిస్తున్నది, లోపల కూర్చున్నవారికి ఎలా అనిపిస్తున్నది? అన్నదానిపైనా అవగాహన వస్తుంది. కారులోని లోపాలనూ గుర్తించవచ్చు.

#### ఫైనాన్స్‌కు వెళ్తే..

నేరుగా నగదు కంటే ఫైనాన్స్ ద్వారా కారు కొనేవారే ఎక్కువ. మీరూ ఆ దారిలోనే వెళ్లాలనుకుంటే ఏయే బ్యాంకుల్లో వాహన రుణాలపై ఎంతెంత వడ్డీరేట్లున్నాయి? ఇతర చార్జీల మాటేంటి అన్నది ఆరా తీయండి.

### ఏం చేయాలి.. ఏం చేయొద్దు

#### ఇవి గుర్తుంచుకోండి

- ✓ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ కార్ల మాడళ్లను, వాటి ధరలను, రుణ సదుపాయాలను పూర్తిగా పరిశీలించండి.
- ✓ మీ బడ్జెట్‌కు తగ్గ కారు దొరికేదాకా వెతకండి. ధరతోపాటు నిర్వహణ, బీమా, ఇతరత్రా వ్యయాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.
- ✓ తుది నిర్ణయం తీసుకొనే ముందు టెస్ట్ డ్రైవ్‌కు సమయం తీసుకోవాలి. ఆపైనే కారు కొనుగోలుకు వెళ్లడం ఉత్తమం.
- ✓ కారును కొనే ప్రక్రియలో మీపై ఏవైనా తెలియని చార్జీల భారం ఉంటున్నదా? అని గమనించండి. అనవసరంగా ఏ సర్వీసునూ తీసుకోవద్దు.
- ✓ సంతకాలు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు డాక్యుమెంట్లను పూర్తిగా చదవండి. ఫైనాన్స్, లీజ్ అగ్రిమెంట్ల నియమనిబంధనలను, షరతులను తెలుసుకోండి.

### ఇవి చేయకండి

#### తొందరపడి..

కారును చూసో.. ఆయా సంస్థలు, డీలర్లిచ్చే ఆఫర్లకు ఆకర్షితులయ్యో.. ఎవరి బలవంతంతోనో.. కొనేందుకు బయలుదేరవద్దు. కుటుంబ సభ్యులతో చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే ఓ నిర్ణయానికి రావాలి. అప్పుడే ఎల్లవేళలా మీకు వారి మద్దతుంటుంది.

#### ఎక్కువ ఈఎంఐలు వద్దు

రుణ వాయిదాలను పెంచుకుంటే మీపై భారం తగ్గుతుందని డీలర్లు చెప్తే దాన్ని నమ్మవద్దు. ఎందుకంటే ఈఎంఐలు పెరిగితే మీపై వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి ఈఎంఐ ఎక్కువైనా.. వీలైనంత త్వరగా రుణ విముక్తులయ్యేందుకే మొగ్గు చూపండి. డౌన్ పేమెంట్ ఎక్కువగా కడితే రిలీఫ్‌గా ఉంటుంది.

#### ఊ కొట్టొద్దు

చెప్పిన ధరకే కాకుండా డీలర్లతో ఇంకా రేటు తగ్గేదాకా సంప్రదింపులు జరుపండి. డాక్యుమెంటేషన్, డెస్టినేషన్ చార్జీలు, పన్నులు, ఇతరత్రా ఫీజుల గురించి తెలుసుకొని, వాటిని వీలైనంత వరకు దూరం చేసుకునేలా మాట్లాడండి. బెటర్ డీల్‌కు ప్రయత్నించండి. కారు కొన్న తర్వాత అదనపు యాక్సరీస్ బిగించుకోవడంలోనూ జాగ్రత్త వహించి అవసరమైతేనే ముందుకెళ్లండి.

#### పాత కారు విషయంలో..

మీకు పాత కారు ఉంటే దాన్ని అమ్మే విషయంలో తొందరపడవద్దు. ఎక్కువ ధర వస్తున్నదని అమ్ముకుంటే.. కొత్త కారు విషయంలో ఏదైనా తేడా కొడితే అనవసరపు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.





# రాబడి

*గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.*

## ఈ మార్పులు తెలుసా?

- 2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.
- కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.50,000 ఉండటమే కారణం. పెన్షనర్లకూ ఈ ప్రయోజనం ఉంటుంది.
- కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్నుండదు. రూ.3-6 లక్షల మధ్య 5%, రూ.6-9 లక్షల మధ్య 10 %, రూ.9-12 లక్షల మధ్య 15 %, రూ.12-15 లక్షల మధ్య 20 %, రూ.15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.






# పీపీఎఫ్ ఖాతా లాభాలివే..

**పొదుపునకు,** దీర్ఘకాలిక మదుపునకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) చక్కని సాధనం. పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ వ్యక్తుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుంది. పీపీఎఫ్ వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 3 నెలలకోసారి సమీక్ష జరుగుతుంది. ప్రస్తుత వార్షిక వడ్డీరేటు 7.1 శాతం. కనీసం 15 ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో ఐదేండ్లు నిరవధికంగా ఖాతాను పొడిగించుకోవచ్చు. ఈ ఖాతా లాభాలను పరిశీలిస్తే..

#### అధిక వడ్డీరేట్లు

పీపీఎఫ్‌లో వడ్డీరేట్లు సాధారణంగా 7-8 శాతంగా ఉంటాయి. సేవింగ్స్ ఖాతా వడ్డీరేటు 3-4 శాతమే. అందుకే పీపీఎఫ్ ఖాతాలు ఆకర్షణీయంగా మారాయి.

#### పన్ను ప్రయోజనాలు

ఖాతాలో జమయ్యే మొత్తాలతోపాటు వాటిపై పొందే వడ్డీ ఆదాయానికీ ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం తమ పీపీఎఫ్‌కు ఖాతాదారులు రూ.500కు తగ్గకుండా, రూ.1.5 లక్షలకు మించకుండా జమ చేసుకోవచ్చు.

#### సురక్షిత పెట్టుబడి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకమే పీపీఎఫ్. కాబట్టి ఇదో సురక్షిత పెట్టుబడి. కచ్చితమైన, స్థిరమైన రాబడులుంటాయి. స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకున్న రిస్క్ ఇక్కడ ఉండదు.

#### రుణ సౌకర్యం

ఖాతాదారులు తమ ఖాతాలో ఉన్న నిల్వల్లో 25 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఖాతా తెరిచిన ఐదేండ్ల తర్వాత కొద్ది కొద్దిగా (బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు) నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

#### పీపీఎఫ్ ఖాతాకు ఎవరు అర్హులు?

- ✓ భారతీయ పౌరులై ఉండాలి.
- ✓ ఖాతాను కేవలం ఒక్కసారే తెరవగలం.
- ✓ మేజర్లు అయ్యేదాకా మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పీపీఎఫ్ ఖాతా తెరిచి నిర్వహించవచ్చు.

#### ఏయే పత్రాలు కావాలి?


- ✓ ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర కేవైసీ ధ్రువీకరణలు.
- ✓ ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.
- ✓ అకౌంట్ తెరిచే ఫారం.
- ✓ నామినీ వివరాలు.

#### ఖాతాను ఎలా తెరవాలి?

- ✓ ప్రధాన బ్యాంకులన్నింటిలో ఈ ఖాతా సౌకర్యం ఉంటుంది.
- ✓ బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.
- ✓ 'ఓపెన్ ఏ పీపీఎఫ్ అకౌంట్' ట్యాబ్‌ను ఎంచుకోవాలి.
- ✓ మైనర్ల కోసం అయితే 'మైనర్ అకౌంట్', మీ కోసమే అయితే 'సెల్ఫ్ అకౌంట్'ను ఎంచుకోవాలి.
- ✓ ఆపై అడిగిన వివరాలన్నీ దరఖాస్తు ఫారంలో నింపి సరిచూసుకోవాలి.
- ✓ ప్రతీ ఆర్థిక సంవత్సరం మీరు డిపాజిట్ చేసే మొత్తాన్ని పేర్కొనాలి.
- ✓ పీపీఎఫ్ ఖాతాలోకి మీ సేవింగ్స్ ఖాతా నుంచి డిపాజిట్లు వెళ్లేందుకు అనుమతులివ్వాలి.
- ✓ ఓటీపీని పొందేందుకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
- ✓ ఓటీపీని ఎంటర్ చేసి ధ్రువీకరించుకోవాలి.
- ✓ ఆపై మీ ఖాతా మొదలవుతుంది. ఈ సమాచారం మీకు ఫోన్ మెసేజ్ లేదా ఈ-మెయిల్ ద్వారా వస్తుంది.

# ఆటుపోట్లకు అవకాశం

**గత** వారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. సూచీలు జీవనకాల గరిష్ఠాల వద్ద ఉన్నా.. మదుపరులు పెట్టుబడులకే ఆసక్తి కనబర్చారు. అక్కడక్కడా అమ్మకాల ఒత్తిళ్లకులోనైనా.. ఓవరాల్‌గా మాత్రం కొనుగోళ్లతో కదం తొక్కారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు నయా ఆల్‌టైమ్ హైలను సృష్టించాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 963.87 పాయింట్లు ఎగిసి 80 వేలకు కూతవేటు దూరంలో 79,996.60 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 313.25 పాయింట్లు ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,323.85 దగ్గర నిలిచింది. నిజానికి సెన్సెక్స్ తొలిసారి 80 వేలను దాటిపోయింది. నిఫ్టీ కూడా 24,400 పాయింట్లను అధిగమించింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణ వైపు నడిచారు. దీంతో ఈ చారిత్రక స్థాయిల్లో సూచీలు నిలబడలేకపోయాయి. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల నడుమ ఊగిసలాటకు గురికావచ్చన్న అంచనాలున్నాయి. అందుకే సూచీల ఆటుపోట్లకు అవకాశాలున్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




మార్కెట్ పల్స్